క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపలి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంత కుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ఎస్ఎంఎస్, నిజాంపేట్, మా విల్లాస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

◆ ఫీడర్ల లైన్ల ఖ్యూరిఫికేషన్ పనుల నేపథ్యంలో ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కోకకోలా, భౌరంపేట్, కేవీఆర్, జగన్ స్టూడియో ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రోజా వెంచర్, వీఎస్ఆర్ ఓల్డేజ్ హోమ్, భౌరంపేట్ గ్రామం, సుకృతి హోమ్స్, ప్రణీత్ ఆర్కిడ్, కేవీఆర్ వ్యాలీ, ఎన్ఆర్ఐ కాలనీ, విష్ణుప్రియనగర్, అక్షర స్కూల్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అపర్ణ ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెంట్రల్ పార్క్, ఏఎంఆర్ ఫంక్షన్ హాలు, వెంకటసాయి కాలనీ, మికాస స్టెర్లింగ్, రాజధాని దాబా లేన్, అపర్ణ, స్ప్లెండర్ అపర్ణ, దేవేందర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ బదిలీ

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న సంజీవరావు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా 2021 నవంబర్ నుంచి పనిచేస్తున్న సంజీవరావు సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఎవరు వస్తారన్నది తెలియాల్సి ఉంది.

400 మంది విద్యార్థులకు దంత పరీక్షలు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మల్లారెడ్డి డెంటల్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కమిటీ, బాచుపల్లి కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత డెంటల్ చెకప్ నిర్వహించారు. మల్లారెడ్డి వైద్యులు ప్రొఫెసర్ పరప్ప సజ్జనార్, డాక్టర్ స్వాతిల ఆధ్వర్యంలో మొత్తం 400 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. మేడ్చల్ జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సీహెచ్ఎం చారి, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రశాంత్, బాచుపల్లి మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు అనంత కుమార్, శంకర్రావు, సమతా విభాగం కన్వీనర్ రాకి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సోమవారం గాజులరామారం డివిజన్ పరిధి దేవేందర్‌నగర్, బతుకమ్మబండ ప్రాంతాలకు చెందిన 100మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పిన పున్నారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేసే కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ నాయకులు లాల్ మొహమ్మద్, గఫర్, దండే రాజు, రాజ్ కుమార్, విశాల్ తదితరులు ఉన్నారు.

అన్నదానం

కుత్బుల్లాపూర్: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం త్రిశూల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్నదానం చేశారు.



ఎమ్మెల్యే వివేకానందకు మిఠాయి తినిపిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు సురేష్‌రెడ్డి

దశాబ్దాల కల నెరవేరిన వేళ

- ఆనందంలో ఆర్టీసీ ఉద్యోగులు
- ఎమ్మెల్యేను కలిసి మిఠాయి తినిపించిన వైనం
- సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

జీడిమెట్ల: ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత మన ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. టీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం పట్ల జీడిమెట్ల ఆర్టీసీ కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీడిమెట్ల డిపో వద్ద ఉద్యోగులు ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి మిఠాయి తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు ఎమ్మెల్యే వివేకానంద, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డితో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నాయకులు మన్నెరాజు,ఆర్టీసీ ఉద్యోగులు గోవర్ధన్, అఫ్జల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ ఉద్యోగులు మరింత బాధ్యతతో పనిచేయాలి..**

టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతతో పనిచేసి సంస్థను మరింత పైకి తేవాలని ఎమ్మెల్యే వివేకానంద కోరారు. ప్రజలకు ఆర్టీసీపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెరుగైన సేవలను ఉద్యోగులు ప్రజలకు అందజేయాలని ఆయన కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆర్టీసీని లాభాల్లోకి తీసుకువచ్చి కేసీఆర్‌తో మెప్పుపొందాలని ఆయన ఆకాంక్షించారు.

◆ **మౌలిక వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ నం.1**

గ్రామాల అభివృద్ధితో పాటు పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ నం.1 స్థానంలో ఉందని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. మంగళవారం ఆయన గాజులరామారం డివిజన్‌లోని హెచ్ఏఎల్ కాలనీ, ఆదర్శనగర్‌లలో 93వ రోజు ప్రగతియాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పర్యటిస్తూ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు జరిగిన తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాపులు

కుత్బుల్లాపూర్: అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో కాపు సంఘం భవనానికి 5 ఎకరాలు కేటాయించడంపై కాపులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కాపు సంక్షేమ సంఘం నాయకులు చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. కుత్బులాపూర్ నియోజకవర్గ కాపు సేవ సమితి అధ్యక్షులు సత్తి ఏసుబాబు, డేగా కృష్ణ మూర్తి, సుబ్రహ్మణ్యం, సురేష్, రామచంద్రరావు, సూర్యచంద్రరావు, స్వీట్ సత్యనారాయణ, పరమేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు

కుత్బుల్లాపూర్: ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని.. ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడ్డ జనాన్ని కలిసి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. వర్షాల వల్ల దెబ్బ తిన్న రోడ్ల పరిస్థితిపై అధికారులకు వివరించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ..... ప్రాంతాల అభివృద్ధి కోసం ఇప్పటికే కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో సైతం ఇదే తరహాలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఊరుకునే సమస్య లేదని హెచ్చరించారు.

ఎమ్మెల్సీని కలిసిన కాపు సంఘం నేతలు

దుండిగల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కాపు సంక్షేమ భవనానికి 5 ఎకరాలు స్థలాన్ని కేటాయించారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తు కాపు సంఘం నేతలు మంగళవారం శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట కార్పొరేటర్లు చిట్ల దివాకర్, గాజుల సుజాత, శ్రీ వంగవీటి మోహన్‌రంగ కాపు వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కోలా లచ్చిబాబు, బోనం నాడు, నరేందర్, చింతా కృష్ణమోహన్, నూకల మల్లేశ్వరరావు, బోడపాటి కిశోర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్న ప్రజలు

సెల్ టవర్ల ఏర్పాటును నియంత్రించాలి

రంగారెడ్డినగర్: సూరారం డివిజన్ పరిధిలో విచ్చలవిడిగా వెలుస్తున్న సెల్ టవర్లను నియంత్రించాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. షాపూర్‌నగర్, న్యూ షాపూర్ నగర్‌లలో అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ల విషయమై సోమవారం గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్‌కు సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రజల ఆరోగ్యాలపై దుష్ప్రభావాలు చూపే సెల్ టవర్లను ఇష్టానుసారంగా నివాసిత ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తాము సర్కిల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నామని చెబుతున్నారని మండిపడ్డారు. మురికివాడలలో నివసిస్తున్న ప్రజలు 80 గజాల స్థలంలో ఇళ్లను నిర్మించుకుంటామని పర్మిషన్ అడిగితే కుదరదని చెప్పే అధికారులు సెల్ టవర్లకు ఎలా పర్మిషన్ ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే జనవాసాల్లో ఉన్న సెల్ టవర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షాపూర్‌నగర్ శాఖ కార్యదర్శి రావుల స్వాతి, సంతోష్ రెడ్డి, మందాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం నిత్యావసరాలను పంపించాం

దుండిగల్: వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదల వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా భూపతిరెడ్డి ములుగు ప్రాంతంలో నిత్యావసరాలను పంపిణీ చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే సీతక్క క్యాంపు కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డారన్నారు. పలువురు మృతి చెందడం బాధాకరమన్నారు. పార్టీలకు అతీతంగా బాధితులకు అండగా నిలవాలని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ములుగు ప్రాంతానికి నిత్యావసరాలను పంపించామన్నారు. కార్యక్రమంలో బౌరంపేట మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, కాంగ్రెస్ ఫిషరీస్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్ ముదిరాజ్, ప్రసాద్ రెడ్డి, నరేశ్, శివ, బాలు తదితరులు పాల్గొన్నారు.



నిత్యవసరాలను తరలిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

కొంపల్లి అభివృద్ధి విషయంలో చర్చకు సిద్ధం

కుత్బుల్లాపూర్: కొంపల్లి అభివృద్ధి విషయంలో ఎప్పుడైనా చర్చకు సిద్ధమని మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సవాల్ విసిరారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓరువలేకే తమపై నిందారోపణలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకులకు దమ్ముంటే అవినీతి ఎక్కడ జరిగిందో నిరూపిస్తే తాను ప్రతి వార్డులో చర్చకు వస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమన్నారు. గడిచిన నాలుగు ఏళ్లలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 2004లో 650 మందికి పట్టాలు మంజూరు చేశామని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు వర్షం పడ్డ ప్రతిసారి వారిని కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం తగదన్నారు.



మళ్లీ జలదిగ్బంధంలో ఓక్షిత్

సుభాష్‌నగర్: సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గాజులరామారం లోని ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో మళ్లీ వరద ఉధృతి పెరిగింది. ఓక్షిత్‌లోని అన్ని రోడ్ల గుండా వరద నీరు ప్రవహిస్తున్నడంతో బయటికి ఏ ఒక్కరూ రాలేకపోతున్నారు. జలదిగ్బంధం నుంచి బయటపడాలంటే కట్టు కాలువపై వెలిసిన నిర్మాణాలను తొలగించడం ఒక్కటే మార్గమని స్థానికులు అంటున్నారు.

ఉప కమిషనర్‌ను కలిసిన ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: అల్వాల్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డిని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ సీఐ మల్లికార్జున్ లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రాఫిక్ విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులపై ప్రధాన కూడళ్ల వద్ద చేపట్టాల్సిన పనులను వివరించారు.

ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సుభాష్‌నగర్: టెక్ మహీంద్ర యాజమాన్యం తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం బహదూర్‌పల్లిలోని టెక్ మహీంద్ర వద్ద సమ్మెకు దిగిన ఉద్యోగులు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. తొలగించిన ఉద్యోగుల విషయమై మహీంద్ర యూనివర్సిటీ వైస్‌చైర్మన్‌తో మాట్లాడామన్నారు. మూడు రోజుల గడువు కోరినట్లు తెలిపారు. ఉద్యోగులకు న్యాయం జరిగేందుకు శాయ శక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రావు, నాయకులు పిట్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, ఇంద్ల నర్సింగరావు తదితరులు ఉన్నారు.

రోడ్లకు మరమ్మతులు



సుభాష్‌నగర్: ఇటీవల కురిసిన వర్షాలకు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని జీడిమెట్ల



పారిశ్రామిక వాడలో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. మంగళవారం వర్షం విరామం ఇవ్వడంతో జీహెచ్ఎంసీ, ఐలా సిబ్బంది గుంతలను పూడ్చేశారు.

అభివృద్ధి పనులపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులపైబీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎదురు దాడికి దిగారు. ఒకప్పుడు వర్షం పడితే వరదనీటితో నిండిపోయే బండారి లేఅవుట్, బాలాజీనగర్ కమాన్ ప్రాంతాల్లో రూ.87 కోట్లతో ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అదే విధంగా రూ.120 కోట్ల నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు తదితర సదుపాయాలను మెరుగు పరిచామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తీరు మార్చుకోకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నాయకులు రవికాంత్, అవుల జగన్, నాగరాజ్‌యాదవ్, నిరుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు పొన్నం రాజు

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి ప్రశాంత్‌నగరకు చెందిన పొన్నం రాజు (39), లావణ్యలు భార్యాభర్తలు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. గత 31వ తేదీ ఉదయం లావణ్య తన ముగ్గురు పిల్లలను తీసుకుని కూలి పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి పైకప్పు రాడ్డుకు చీరతో ఉరివేసుకుని రాజు వేలాడుతూ కనిపించాడు. చుట్టు పక్కల వారి సహాయంతో అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమానికి బీఆర్‌టీయూ కృషి

రంగారెడినగర్: కార్మికుల సంక్షేమానికి బీఆర్‌టీయూ కృషి చేస్తోందని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని ఎంటీఏఆర్ కార్మికుల గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. యూనియన్ అధ్యక్షుడిగా బీఆర్‌టీయూ నుంచి పోటీ చేస్తున్న తమను గెలిపిస్తే కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందంతో పాటు జీవితబీమా, వయోపరిమితి పెంపు, మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈనెల 3న జరిగే ఎన్నికల్లో బీఆర్‌టీయూకు మద్దతు తెలిపాలన్నారు. బాణం గుర్తుకు ఓటేసి తమ ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన బోర్డ్ చైర్మన్ నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

'అన్ని వసతులు ఉన్న మా పాఠశాలలో చేర్పించాలి'



ర్యాలీలో పాల్గొన్న కార్నివాల్ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ శివనగర్‌లో, గాజులరామారం డివిజన్ పరిధిలోని లెనిన్‌నగర్ ప్రాథమిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఏడాది క్రితం ఈ పాఠశాలలను కార్నివాల్ ఫౌండేషన్ దత్తత తీసుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం, టాయిలెట్ల వసతి, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు, వంట గది నిర్మాణం చేశారు. ఈ పాఠశాలల్లో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ మంగళవారం ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అన్ని వసతులు ఉన్న ఈ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

పాఠశాలల్లో రాగి జావ



జగద్గిరిగుట్ట: వారంలో 3 రోజుల పాటు ఈ రాగా జావాను విద్యార్థులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో దాదాపు అన్ని పాఠశాలలో శ్రీకారం చుట్టారు. ఎన్నో పోషకాలతో ఆరోగ్యానికి ఉపయోగపడే ఈ రాగి జావ విద్యార్థులను ఆరోగ్యంగా ఉంచుతుంది. మంగళవారం జగద్గిరిగుట్టలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది.

ట్రాఫిక్ నియంత్రణకు వలంటీర్లకు శిక్షణ



పాఠశాలల యాజమాన్యాలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ



శిక్షణ పొందిన వలంటీర్లతో ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు సూచన మేరకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్పెషల్ ఇన్నోవేషన్ ఆక్టివిటీ ఎస్ఈఎస్‌ఈ సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో భాగంగా వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీళ్ల ట్రాఫిక్ పోలీసులతో కలిసి ట్రాఫిక్ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తారు. ఉదయం స్కూల్ టైమ్, సాయంత్రం వేళల్లో వీరు విధుల్లో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. మొదటి దశలో సత్ఫలితాలు వస్తే రెండో దశలో మరో జంక్షన్ వద్ద వలంటీర్లను నియమిస్తారు. అందుకు తగ్గట్లుగా వలంటీర్లకు శిక్షణ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. సుమారు 45 స్కూళ్ల యాజమాన్యాలతో మేడ్చల్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, జీడిమెట్ల, సనత్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు సమావేశాలు ఏర్పాటు చేసి ముందుకు సాగుతున్నారు.